# ఓటు కత

అయ్యా, నాయనా! నామింద మీరు కొంచేపు దయబెట్టాల. ఏందిరా ఈడు, మనమేందో మనపనిపైన పోతావుంటే వచ్చి, కాళ్ళకు చుట్టుకుణ్ణాడు, అనుకోవదు. అంతా ఎంతసేపు? వక్క కొరికేంత సేపు. ఆ పయిన మీ పనిపయిన మీరు పోదురు. నా బతుకు ఏరవను ఎదుక్కుంటా నేనూ పోతాను. ఇంటే మాకేమొస్తాది అని మీరడగొచ్చు. బిడ్డకు పాలిస్తే తల్లికేమొస్తాది సామీ? వాన కురిపిస్తే మబ్బుకేమొస్తాది? చెట్టును కదిలిస్తే గాలికేమొస్తాది? ఇవ్వన్నీ లాభమెంత, నష్టమెంత అని లెక్కాపక్కా చూసే పన్జేస్తాయా? అదేంలేదే! ఇదీ అంతే ననుకోవాల.

పోరాపో అని మీరు యిదిలించి పారేస్తే నేను నా కతను ఎవురితో జెప్పుకొందు? రాళ్ళింటాయా, గోళ్ళింటాయా? సెట్లూ సేమలూ ఇంటాయా?

ఇంటేగింటే మనుషులే యినాల. ఆ మన్సుల్లోనూ అందరూ యింటారా? యినరు. మనుసు కలిగినోళ్ళు, బిడ్డపాపలున్నోళ్ళు, తమ బోంటి దరమ ప్రెబువులే యినాల. చూడ్నాడు, అప్పుడే ముకం సిట్లిస్తావుండారు. పెదిమ ముడేస్తావుండారు. వొద్దొద్దు. నేను రూకా అద్దగా అడిగేదానికి గానీ, ఒక పూట అన్నం పెడితే తినేసి పోదామని గానీ, ఒక నాలుగుమూళ్ళ పంచకోరం దేబరించదానికనిగానీ వచ్చినోణ్ణిగాను. నేనుండాను, నా రెక్కల కష్టముండాది, రాముదుండాడు, రాజ్జెముండాది, ఏడ పనుంటే ఆడ నేనుంటాను. బండేతోలాల్నే, యరకే దున్నాల్నే, పైరే కోయాల్నే - అనేంలేదు నాకు! మాలావు రాతిగుండ్లను నేను సిన్న సిన్న గులకరాళ్ళుగా కొట్టేసినాను. పెద్ద పెద్ద మాకుల్ని కాసంత కట్టే పేళ్ళుగా చీల్చేసినాను కొలిమిలో ఎర్రగా కాలిన యినుమును మూర బారడయ్యేట్టుగా సాగ్గొట్టేసినాను. సర్లే, నేను సెప్పాలనుకొనింది అదిగాదు సామీ! ఇత్తనం ఏసేదానికి ముందు నేలను మెత్తగా దున్ని పక్వం చెయ్యాల్నా వొద్దా? బండి కట్టేదానికి ముందు యిరుసుకు కందెన ఎయ్యాల్నా వొద్దా? అట్లనే ముందుగ్గా నాసోది కొంచెం మీ సెవిలో ఏస్తిని. ఇప్పుడసలు కతలోకొస్తావుండ.

నేను పుట్టి బూమ్మీదపడి ఎన్నేండ్లయిందో సరిగ్గా తెలవదు. నా బుద్ది నాకు దెలిసటప్పటికి మా అయ్య రంగసంద్రంలో ఊరావులు మేపతావుండాడు. మా అమ్మ కా వూరు. మణేగారింట్లో పని. బుడంకాయంతోణ్ణిగా వున్నప్పట్నించీ నేను మా అయ్యతోనే వుండేవాణ్ణి. తోకంటి నారాయణా అనినట్టుగా ఆయన్తో అడివికి పోయ్యేదిన్నీ, పొద్దు గూకుతూ అడివిలో తిరిగేదిన్నీ, పొద్దుగూట్లో పడేప్పటికి ఊళ్ళోకి వచ్చేదిన్నీ. చూస్తా చూస్తా వుండగానే నాకు వయసు పదోపన్నెండో వచ్చేసింది. నేనూ అంతోయింతో సంపాదించేవాణ్ణి అయిపోతిని. మా అయ్య అప్పుడప్పుడు నన్ను దగ్గిర కూచోబెట్టుకోని లోకం సంగతులన్నీ వెదర బెట్టేవోడు. ఒరే పిలగాడా! మన దేశాన్ని ఏలే వాడువుడో తెల్సునా నీకు? వాణి పేరు తెల్లోడు.

ఎక్కడ్నో సముద్రాలకవతల ఒక దీవిలోనంటా వాడుండేది. వాడు ఏం పనిమీదొచ్చినాడో, ఏం మాయా జేసినాడో మనకు తెలవదు. మన దేశమంతా వాడి గుప్పిట్లో గులకరాయైపోయింది.

వాడు ఆడిందే ఆట. వాడు పాడిందే పాట. వాడు కూచోమంటే కూచోవాల, నిలుచోమంటే నిలుచుకోవాల. ఇట్లావుంది కత. ఈలోగా ఏమయిందంటే, గాందీమహాత్ముడు అనే పెద్దాయన ఒకడు ముతక పరకాళా పంచ ఒకటి కట్టుకోని, అంతకంటే ముతక దుప్పటి ఒకటి కప్పుకోని, ఆకు చెప్పులు తొడుక్కోని, కంటద్దాలు పెట్టుకోని, సేత దుడ్డుకర్ర ఒకటి పట్టుకోని, బోడితలమీద కాసంత జుత్తు రెపరెపలాడతా వుండగా జనం మధ్యలోకి వచ్చేసినాడు. వచ్చి ఏమనినాడు? 'ఈదేశం మాది. ఇది మా అయ్యల సొత్తు. ఇది మాతాతల సొత్తు. ఇక్కడ యింకొకడి పెత్తనం మేమొప్పుకోము. మాకు సొరాజ్జెం కావాల. తెల్లోడి దొరతనం కొండెక్కాల' అనినాడు. అమ్మో, ఇంకేమైనా వుందా? తెల్లదొరకు ఒళ్ళు మండింది. కొట్రా లాఠీల్తో అనినాడు. తొయ్‌రా జైల్లో అనినాడు. కాల్చురా తుపాకుల్తో అనినాడు. వాడికెదురులేకుండా వుంది. మనకు దిక్కు లేకుండా వుంది. సూడబోతే నాకేమో వయసు మళ్ళిపోయింది. ఆ సొరాజ్జెమనేది వస్తాదో రాదో? వస్తే ఎప్పుడొస్తాదో ఏమో? వచ్చినా నేను కండ్లజూస్తానో, సూడనో? నా మాటకేమిలేగాని నువు కుర్రోడివి. నువు ఆ మంచి కాలాన్ని కండ్ల జూస్తావు. నీ బిడ్డలు ఆ మంచికాలాన్ని కండ్ల జూస్తారు. ఆ మాట తల్చుకుంటే నాకు కడుపులో పాలు పోసినంత ఆనందంగా వుంది....

మా అయ్య ఎంత జెప్పినాడో అంతా జరిగింది. అప్పటికి నాకు పెండ్లె నలుగురు బిడ్డలు గూడా కలిగిరి. నేను, నా భార్య పెంటపాడు దగ్గిర చెరువుపనీ జేస్తావుంటిమి. ఒకనాడు కొందరు పెద్దమనుషులు తుర్రుమని కారుల్లోవచ్చిదిగిరి. చెరువుకట్ట పయిన వెదురు కొయ్యనాటి జండా ఎగరేసిరి. మనకు సొరాజ్జెం వచ్చేసిందని సెప్పిరి. చెరువు కూలోళ్ళకందరికీ మిటాయిలు పంచిరి. ఆ దినమంతా ఒకటే సంబరం. మళ్ళీ అయిదారు నెలలు పోయినాక ఒక రాత్రి నా భార్య నన్నడిగింది:

'సొరాజ్జెం, సొరాజ్జెం అనిరి. అదొచ్చేసిందని గూడా సెప్పిరి. వచ్చేమైనట్టు? మనం తాగే అంబలి పరమాన్నం కాలేదే! మనం కట్టుకునే చింకిపాత మారలేదే! తలచాటుకు సెట్టునీడ దప్ప యింకొకటేది లేదే! ఇంతేనా సొరాజ్జమంటే?'

అని గింజుకొనేప్పటికి నాకు ఒళ్ళు మండిపోయింది. 'ఒసే పిచ్చిదానా! ఇల్లలకగానే పండగైపోతుందా? పందిరేయగానే పెండ్లైపోతుందా? ఇంకా జరగాల్సిందెంతో వుండదా? దేనికైనా కొంచెం నిదానించాల. ఆత్రగానికి ఆకులో పెడుదువుగానీ, నాకు నేలపైన్నే పెట్టు అనేదానివి నువ్వు. పండుకో, పండుకో' అని యిదిలించి పారేస్తిని. ఆడదాని నోరైతే మూయించినానుగానీ, కాలం గడవనూ గడవనూ నన్నూ, అదే అనుమానం పట్టుకొనింది. పెంటపాడులో చెరువు పని. పులిగడ్డలో తుమ్మసెట్లు నరికే పని. గండబోయన పల్లెలో బావులు తవ్వేపని.

ఇట్లా పొట్టచేతబట్టుకొని తిరగతా అప్పుడు మేము నాగపట్ల కనమలో మట్టిబాట ఏస్తావుంటిమి. అప్పుడనంగా ఒక మాట సెవిలో బడింది. ఏమని? ఎలక్షన్లు వొస్తావుండాయని! ఎలక్షనంటే ఏమో తెలుసుకోవద్దా? అని తీరుబాటుగా వున్న ఒక పెద్దాయన్ను అడిగితిని. ఆయన పాపం, చిలక్కు చెప్పినట్టుగా నాకు యివరాలన్నీ చెప్పేసినాడు. 'ఒరేయ్ రోడ్డుపనోడా! చూస్తివా, నువు ఎలక్షనంటే ఏమి అని అడిగితివి అంటే ఏమన్నమాట?

దేశంలో అభిరుద్ది జరగతావుందన్న మాట! కాకపోతే కూలిజేస్తే కుండకాలి, లేకపోతే కడుపుకాలే వాణ్ణికి కూడా ఎలక్షను సంగతులు కావలిసొస్తాయా?

చెప్తాను యినుు. పైరుకు నీరెట్లనో, సెట్టుకు వేరెట్లనో, బొందికి జీవాలెట్లనో సొరాజ్జానికి ఓటట్లా. నీకు ఇల్లుందా వాకిలుందా, పొలముందా పుత్రుందా, డబ్బుందా దస్కముందా అని ఎవరూ అడగరు. చదువొచ్చునా రాదా అని నిలదియ్యరు. నువ్వు పిచ్చోడివి గాకపోతేచాలు. తప్పుజేసి జైలుకెళ్ళినోడివి గాకపోతేచాలు. నీకిరవై ఒక్కయేండ్లు వొచ్చినాయా లేదా అని మాత్రం అడుగుతారు. ఆయ్యో, ఎప్పుడో నిండినాయిసామీ అని నువ్వను. ఇంక హరిహరాదు లొచ్చినా నిన్ను ఓటెయ్యకుండా ఆపలేరు. ఓటనేది నీ సేతిలో ఆయుధం. దాంతో నువ్వెంత పనైనా చెయ్యొచ్చు. నువ్వీదేశంలో పుట్టినందుకు నీకు భగవంతుడు నరజల్మ ఇచ్చినందుకు నువ్వేం జేయ్యాల? ఓటెయ్యాల. ఏసితీరాల, నువ్వు ఓటు ఎయ్యలేదనుకో – దానికేమని అర్థం? నువు పుట్టి పుట్టనట్టే, ఉండీ ఉండనట్టే, బతికీ బతకనట్టే వింటివిగదా! అదీ సంగతి.'

ఇంటినిగానీ నాకింకా ఓటును గురించి ఎన్నో సందేహాలుండిపోయ. ఇంత యివరంగా జెప్పే పెద్దమనిషి యింకొకడు దొరకడేమోనని, మళ్ళీ ఆయన్నే బతిమాలుకుంటి. 'సామీ! నువ్వు జెప్పిన ఓటు మకిమ బాగానే వుంది. కానీ నేను అన్నెం పున్నెం తెలియనోణ్ణిగదా! కండ్లుండీ చూడలేనోణ్ణిగదా! బుద్ధుండీ ఆలోచించలేనోణ్ణి గదా! నువ్వింత జెప్పినా నాకంతా అయోమయంగానే వుంది. అందుకని అడగతావుండా! కోప్పడొద్దు. ఓటంటే ఏమి? దాన్ని దేంతో చేస్తారు? దాన్ని నాకెవురిస్తారు? ఓటెయ్యి అని నువు పదిసార్లంటివి. దాన్ని నేనెందులో ఎయ్యాల? ఏసినాక అదేమవుతుంది?'

పెద్దాయన అదేపనిగా నాకల్ల జూచి పక్కుమని నవ్వేసినాడు. 'ఒరేయ్ రోడ్డుపనోడా! నువ్వెవుడివోగానీ బలే తెలివైనోడివి. లేకపోతే నీకిన్ని సందేహాలొచ్చే వుండవు. ఓటంటే మరేం కాదు. ఒక కాగితం ముక్క. దానిపైన ఇవరాలు పేర్లు అచ్చేసి వుంటారు. కాని మనదేశంలో చదుముకోనోళ్ళే ఎక్కువగదా! అందుకన్జెప్పి పోటీచేసే వాళ్ళ పేర్లకెదురుగా వాళ్ళగుర్తులు కూడా అచ్చేసి వుంటారు. ఎల్లయ్యది గంట గుర్తనుకో, పుల్లయ్యది కుండ గుర్తనుకో. నీకెవు డిష్టమైతే వాడి గుర్తుపైన ముద్రెయ్యాల. ముద్రేసినాక దాన్నక్కడుండే పెట్టెలో పడెయ్యాల. అట్లా పడిన ఓట్లన్నీ లెక్క పెడతారు. ఎవురి కెక్కువ ఓట్లొస్తాయో, వాడు గెల్చినట్టు లెక్క! రాజ్జమేలేదానికి నువు వాణ్ణి ఎన్నిక చేసినావని లెక్క!"

ఓసింతేగదా అనుకుంటిని. ఎదురు చూచిన ఎన్నికరోజు వచ్చేసింది. వెళ్ళి వరసలో నిలబడితిని. నావంతు నాకొచ్చేటప్పటికి, అక్కడున్న ఆఫీసరు నాకు ఓటియ్యాల్నా పన్లేదా? ఊహూ, ఇయ్యలా. నీ పేరేమి – అనినాడు. చెప్తిని. మీ అయ్య పేరేమి – అనినాడు. చెప్తిని, 'నీ పేరు లేదే! లిస్టు తీసినప్పుడు నువ్వెక్కడుంటివి?' అనినాడు. నాకేం ఒకవూరా? ఆ లిస్టు ఎప్పుడు తీసిరో,అప్పుడు నేనెక్కడుంటినో ఎవురికి గ్నాపకం?

'లిస్టులో పేరుండాలయ్యా! ఈ సారైనా రాయించుకో. మళ్ళీ ఆయిదేండ్ల కోస్తాయిలే ఎలక్షన్లు. వెళ్లు వెళ్లు' అనినాడు ఆఫీసరు. ఓటేసే ప్రాప్తం లేదని తెలిపోయేటప్పటికి నా ముఖాన చింత నీళ్లు చల్లినట్టయింది. మళ్ళీ ఆయిదేండ్లకు నేనెక్కడుంటానో ఏమో!

ఒక్క అయిదేండ్లేంగాదు. అటువంటి అయిదేండ్లు ఎన్నో గడిచిపోయినాయి. నాగపట్ల దగ్గిర చెరువుపని అయిపోయినాక, మేము కట్టగట్టుకుణ్ణట్టుగా దచ్చిణాదికి వెళ్ళిపోతిమి. అక్కడ బారీ పన్లేమీ లేకపోయ. శనిగతీగలు పెరికి కాయలొబ్బిడి చేసేది, చింతకాయలు రాల్చి, పెచ్చులు గింజలూడతీసి పందు మండెవేసేది, మామిడి తోటల్లో పాదులు తవ్వి మందులు కొట్టి, కాయలు దించి బుట్టలు కుట్టేదీ - ఇట్లా చిల్లరమల్లర పనుల్తో గుర్రంకొండ, కలకడ, నెరబెలు ఉదయమానిక్యం, రంగంపేట, చంద్రగిరి, కాశిపెంట్ల - యింకా అట్లాగే ఆ పక్కవూళ్ళన్నీ తిరగతా ఉండిపోతిమి. ఇంతలో రెక్కలొచ్చిన గువ్వపిట్టలాయకట్టుగా కొడుకులు ఎవరిదారిన వారు వెళ్ళిపోయిరి. ఉన్నంతలో కూతుళ్ళకు పెండ్లిజేస్తి. పడమటి గడ్డన ప్రాజెక్టుపని ఒకటి జరగతావుందని తెల్సి నేను, నా భార్య దొడ్డబళ్ళాపురం దాటి వెళ్ళి పద్దెనిమిదేళ్ళదాకా అక్కడ్నే ఉండి పోతిమి. బిడ్డల్ని చూడాలని బుద్ధిపుట్టి తిరిగొస్తావుండగా దోవలో వడదెబ్బ తగిలి, విషజొరం పట్టుకోని నా భార్య కండ్లు మూసింది. తోడులేక, నీడలేక, ఒంటికట్టైనైపోతిని. ముసలితనంలో ఊతగర్రపోయినాక ఇంక ఉండేమి, పోయేమి? ఈ బతుకట్లా ఎంతకాలం ఈడ్చాల్నో, యేమో! పుట్టకగానీ, గిట్టకగానీ మన చేతుల్లో వుందా? ఏమైనా పుట్టి బూమిపైన బడినందుకు, గూటిలోనుంచి చిలక ఎగిరిపోయేలోపల ఒక పనిమాత్రం చేసితీరాల.

ఇప్పుడు నేనుండే వూరేదో చెబుదునా సామీ! దీని పేరు తిమ్మరాజుపాళెం. ఈ సారి ఎన్నికలొచ్చి నేను ఓటు వేసేదాకా ఈ వూరిని వదిలి పెట్టేదిలేదని పంతం బట్టినా. లిస్టెత్తేదెప్పుడో తెలుసుకోని, ఆ అయ్యవారెవురో కనుక్కోని, నా పేరందులో కెక్కించినా. ఆ అయ్యవారెవురోగాని శానామంచోడు. 'ఇంక పోయిరా గంగన్నా! నీ పేరు లిస్టులో కెక్కిపోయింది. ఇది అచ్చె వచ్చేస్తుంది. నువు రాజు మాదిరిగా తలెత్తుకొని పోలింగు బూతులోనికి యెళ్ళు. నీ వోటు నీచేతికొచ్చేస్తుంది.' అనినాడు. అనినట్టుగానే వొచ్చేసింది సామీ! ఏంది? ఓట్ల పండగ. ఖాళీగోడలమీద కుండ బొమ్మలు, గంటబొమ్మలు, నిచ్చెనబొమ్మలు - యింకా ఎన్నెన్నో బొమ్మలు గీయించేసిరి. చాలనిదానికి పెద్ద పెద్ద కాగితాలు దెచ్చి అంటించేసిరి. మైకు సెట్లు పెట్టి ఏక్ధమ్మున సినిమా పాటల్తో గూబలు గుంయిమనిపించేసిరి. వచ్చే జీపులకు కొదవలేదు. తిరిగే కార్లకు తీరికే లేదు. సాయంకాలమైతే చాలు. రచ్చబండ దగ్గర మీటింగు. గుండంచు పంచలు కట్టుకోని, మోకాళ్ళదాకా ఆపారాలు తొడుక్కోని, విసనకర్ర మడుపుల్తో కండువా లేసుకోని గొప్ప జబర్దస్తీ మనుషులు మాటాడ్డమే మాటాడ్డం! వాళ్ళు మాటాడి నిలవకముందే జనం చేతులు తట్టడమే తట్టడం! ఎందుకులెండి పెద్ద జాతరైపోయ! వస్తాది, వస్తాది అనుకున్న ఎన్నికల దినంగూడా రానేవచ్చేశ! ఇంకొక అయిదేండ్లు బతికి నేను వోటెయ్యబోతానా? అదంతా కలలో సంగతి! జల్మానికంతా యిదొకంటే గదా పండగ నాకు! అందుకన్జెప్పి ఆరోజు తెల్లారంగానే సుబ్బానాయుడి బోరింగు పంపు కాడికిపోయి సుబ్బరంగా స్తానం చేసినా. కట్టుకోను మారు పంచలేదే. పై తుండు మొలకు చుట్టుకుని పంచను రాతికేసి కొట్టి, బాగా పులిమి ఆరేసినా. పంచె ఆరేటప్పటికే ఎండ మెరుగెక్కి ముదిరి పోయ! ఇస్కూలు కాడికి పోయి చూస్తునుగదా, వరసగా గ్రామ చావడి దాకా జనమే! ఒకరి వెనక ఒకరుగా హనుమంతుడి తోకమాదిరిగా నిలబడిపోయినారు. నాయిన్నాయినా, ఇంత మంది వోట్లు

యేసేదెప్పుడు, మనవంతు మనకొచ్చే దెప్పుడు అనుకోని, ఈలోపల భోంచేసి వచ్చేస్తే మళ్ళీ ఏకంగా ఎంతసేపైనా పరవాలేదనుకున్నా. అందుకు దగినట్టు భజనగుడి పక్కన సందులో ఎవురో దరమాత్ములు అన్నపుపొట్లా లందిస్తూ వుండిరి. రెండు పొట్లాలు పులుసన్నం, పెరుగన్నం తిని కడుపారా నీళ్ళు తాగితి. ఒక అరగంట సేపటిదాకా సెట్టు నీడలో కూచోని, ఆపైన మళ్ళీ ఇస్కూలు దగ్గరికి బయల్దేరితి. అప్పటికి జనాల వరస గూడా సగం మేరకు తగ్గిపోయ. 'పాపం, ముసలాయన! ఆయన్ను ముందుగా పోనివ్వండి' అని పదిమంది కూడబలుక్కోని నన్ను గేటు దాటించిరి. కట్టడంలో అడుగు పెట్టగానే నలుగురైదుగురు ఆఫీసర్లు కనిపించిరి. ఒకాయన ముందు మేజాపైన ఒక ఇనప్పెట్టే. వోట్లేయాల్సిన పెట్టె అదే కావచ్చు ననుకుంటి. ఇంతలో ఇంకొక ఆఫీసరు, 'ఏమయ్యా పెద్దాయనా! ఇట్లా వచ్చి నిలబడు, నీపేరేమిటో చెప్పు' అనేటప్పటికి వులికిపడి పేరు, ఇంటిపేరు, తండ్రి పేరు అంతా యివరంగా చెప్పుకుంటి. ఆ ఆఫీసరెవురో పాపం, మంచి నిదానస్తుడే! చేతిలో వున్న కాగితాల బొత్తిని తిప్పి తిప్పీ చూచినాడు. కడకొకచోట చూపులు నిలిపి అట్లనే తలపైకెత్తినాడు:

'లిస్టులో నీ పేరుంది' అనినాడు. నాకు ఏనుగెక్కినంత సంబరమైపోయింది. 'కానీ ఏంలాభం? నీ ఓటెవుడో ఏసేసినాడు' అనినాడు.

మిన్ను విరిగి తలపైన పడినట్టయింది. నోట మాటరాలా. బిక్కరించి చూస్తా దిగేలుతో రాతికూసం మాదిరిగా నిలబడిపోతి! ఆఫీసరు క్కూడా 'ఆయ్యోపాపం. ముసలాయనకు వోటు లేకపోయిందే' అని శానా బాధై పోయింది. 'పోనీలే పెద్దాయనా! నీవోటెవురో ఏసేసినారు గదా! అట్లనే నువ్వింకొకరి ఓటేసి మాటాడకుండా యెల్లిపో' అనినాడు. నేను కొంచేపు దిక్కులు చూస్తి. కండ్లు మూసుకోని ఆలోచిస్తి. ఆలోచించినాక, చేతులో జోడించి, ఒక దండం చెల్లించుకుంటి. 'అయ్యా సామీ! పందిరి చెన్నప్పకొడుకును, గంగన్న అనే నేను నా వోటయితేనే ఏస్తా, ఇంకెవురికో పుట్టినట్లు వేరే పేరు, చెప్పుకోని ఆ దొంగోటు ఎయ్యడానికి నా మనసొప్పదు.

మా అమ్మ మా అయ్యకు మాత్రమే కొంగేసి నన్ను కనింది. ఒకరికి పుట్టి నేనింకొకడి పేరు చెప్పుకోను.

పోనీలే సామీ! నా అదురుష్టం యింతే ననుకుంటా. అయితే యిక్కడున్న పెద్దోళ్ళందరూ పెద్ద మనసు పెట్టి ఒక చిన్న పని చెయ్యాల. ఏం లేదు.

పందిరి చెన్నప్ప కొడుకు గంగన్న అనే వాడు నేలబొరికలో ఉడుము మాదిరిగా, సెట్టు తొర్రలో గూబమాదిరిగా, మడుగులో కొంగ మాదిరిగా ఓపినంత కాలం బతికినాడు. అయినా వోటు మాత్రం ఎయ్యలేదు!

వట్టి వోటు బతుకు బతికినాడు' అని రాసి పేపర్లలో ఏసెయ్యండి!' అని తిరిగి చూడకుండా చక్కా బయటికొచ్చేసినాను. ఇదీ సామీ నా కత! ఇదీ సామీ నావోటు కత!

♦ 'అంజలి' వారపత్రిక, 1993 ♦